# భారతదేశంలోని రిజర్వేషన్లపై సమగ్ర మూల్యాంకనం – పరిశీలన

**మైలారిశెట్టి చైతన్య, రీసెర్చ్ స్కాలర్,**
**తెలుగువిశ్వవిద్యాలయం.**

"పరస్పరం సంఘర్షించిన శక్తుల నుండే చరిత్ర పుడుతుంది", అనే హెగెల్ మాటను మహాప్రస్థానంలో శ్రీశ్రీ ఉటంకించారు. చారిత్రక నిర్ణయాల వెనుక ప్రతి అంశం రాపిడికి గురైనదే. ఇప్పుడు దేశంలో రిజర్వేషన్ల పెంపు అంశం కూడా అదే స్థితిని ఎదుర్కొంటున్నది. కొన్ని సామాజిక వర్గాలకు కొత్తగా రిజర్వేషన్ల వర్తింపు, కొందరికి పెంపు అనే అంశం భారతదేశ రాజకీయ వ్యవస్థలో ప్రస్తుతం ప్రధాన అంశంగా మారింది. దీనిపై ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాధినేతది, రాష్ట్ర ప్రభుత్వాలది, కోర్టులది భిన్నమైన అభిప్రాయం కావడంతో సమస్య జటిలంగా మారుతున్నది. ఇక్కడ రాష్ట్రాల మాట నెగ్గుతుందా? కేంద్రం పెత్తనం సాగుతుందా? చట్టసభల శాసనాలు చెల్లుబాటవుతాయా? న్యాయస్థానాల తీర్పులే శిలాశాసనమా? రాజ్యాంగాన్ని ఎవరి అన్వయం నుంచి అర్థం చేసుకోవాలి? అనే ప్రశ్నలకు సమాధానం దొరికితే రిజర్వేషన్ల అంశానికి కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తామని ఎవరైనా మాట్లాడితే అది తప్పు అని గుజరాత్ ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి చేసిన ప్రకటన బిజెపి పాలిత రాష్ట్రాలతో పాటు చాలా రాష్ట్రాల ముఖ్యమంత్రి ఇతరులకు రుచించలేదు. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా 50శాతానికి మించి రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. గుజరాత్‌లో మోడి ఆ వాదన ముందుకు తెచ్చారు. గుజరాత్‌లో మాట్లాడినప్పటికీ ప్రధాని మాటలు యావత్ దేశానికి వర్తిస్తాయి. రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీ తీర్మానం చేసి, 9వ షెడ్యూల్‌లోచేర్చాలని కేంద్రానికి సిఫారసులు పంపిన చాలా రాష్ట్రాలకు తన ప్రకటన ద్వారా కేంద్రప్రభుత్వ వైఖరిని 50 శాతం ప్రధాని వెల్లడించారు. మోడి ప్రకటన ఆయా రాష్ట్రాలకు, ఆయా సామాజికి వర్గాలకు ఆశనిపాతం. ఒకే దేశంలో ఒకే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, న్యాయస్థానాలు వేర్వేరు వైఖరులు కలిగి ఉండడం ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసే అంశం మాత్రం కాదు. అయితే ఈ తాత్కాలిక సంఘర్షణ నుంచి శాశ్వత పరిష్కారం ఉద్భవించే అవకాశాలు కూడా ఉండడం మాత్రం ఖచ్చితంగా సానుకూలాంశామే. అసెంబ్లీ తీర్మానాలు చేశాం, తమ చేతిలో ఏమీలేదు, కేంద్రానిదే భారం అని రాష్ట్రాలు మౌనంగా ఉంటే సమస్య ఎక్కడేసిన గొంగళి అక్కడే

అన్నట్లుంటుంది. రిజర్వేషన్ల కోసం ఎదురుచూసే సామాజిక వర్గాల్లో అశాంతి పెరిగి అది మరో సమస్యకు దారితీస్తుంది. కానీ తాము చేసిన తీర్మానానికి అనుగుణంగా ఎందుకు స్పందించరు అని కేంద్రాన్ని రాష్ట్రాలు నిలదీస్తే మాత్రం ఫలితం ఖచ్చితంగా ఉంటుంది. తెలంగాణ ముఖ్య మంత్రి కేసిఆర్ అలాంటి ఖచ్చితమైన వైఖరితోనే ఉన్నారు. బిజెపి ముఖ్యమంత్రులు కాస్త వెనుకా ముందూ ఆలోచించినా, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీలు మాత్రం పోరా టానికి సిద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల మద్దతు కోరాల్సిందే కాబట్టి, దోషిగా నిలబడడానికి ఎవరూ సాహసించకపో వచ్చు. కాబట్టి ప్రజాభిప్రాయం ప్రకారం అంతిమ నిర్ణయం తీసుకోక తప్పదు. 2019 ఎన్నికల్లో ఎవరికీ ఓటు వేయాలనే విషయంలో ప్రజలకు ఒక అభిప్రాయానికి రావడానికి ఎంచుకునే అంశాల్లో రిజర్వేషన్ల అంశం కూడా ఉంటే ఫలితం తప్పకుండా వచ్చి తీరుతుంది.

తెలంగాణతో బిజెపి పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, హర్యానా, మహారాష్ట్ర, బిజెపి భాగస్వా మిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా 50 శాతానికి మించి రిజర్వేషన్లు అవసరమని భావిస్తు న్నాయి. ఇందుకోసం అసెంబ్లీ తీర్మానాలు కూడా చేశాయి . తెలంగాణలో ముస్లింల రిజర్వేష న్లను 4 నుంచి 12 శాతానికి, ఎస్టీల రిజర్వేషన్‌ను 6 నుంచి 9శాతానికి పెంచి మొత్తం రిజర్వేష న్లను 61శాతం చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. కాపులకు 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చేసింది. బిజెపి పాలిత రాజస్థాన్ రాష్ట్రం గుజ్జర్లతో పాటు మరో ఐదు కులాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఓబిసిల కోటాను 21 నుంచి 26కు పెంచుకుని రిజర్వేషన్ల శాతాన్ని 54కు చేర్చింది. మహారాష్ట్రలో మరాఠాలకు 16 శాతం, ముస్లింలకు 5 శాతం రిజర్వే షన్లు ఇవ్వడం ద్వారా అక్కడా రిజర్వేషన్ల శాతం 52కు చేరింది. మిగతా రాష్ట్రాల్లో కూడా కొన్ని సామాజిక వర్గాలు రిజర్వేషన్ పెంపుకోసం కొట్లాడుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో వారికి రాజ కీయ మద్దతు కూడా లభిస్తున్నది.

తమిళనాడులో 69శాతం, ఎస్టీలు ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లో 80శాతం వరకు రిజర్వేషన్లు అమలు చేస్తూ మిగతా రాష్ట్రాలకు మాత్రం ఆ హక్కు లేదనడం ఎంత వరకు భావ్య మనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. ఒకే దేశంలో రాష్ట్రానికో నిబంధన వర్తిస్తుందా? అనే నిరసనలు అనివార్యమవుతున్నాయి. సామాజిక వెనుకబాటును రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలన్న రాజ్యాంగం మాట ప్రకారమే తాము రిజర్వేషన్లు కల్పిస్తుంటే కోర్టులెందుకు అడ్డు కుంటున్నాయన్నదే రాష్ట్రాల ప్రశ్న. అందరికీ సమానావకాశాలు అనే స్ఫూర్తికి రిజర్వేషన్లు నిజం గానే విఘాతం కలిగిస్తే, మరి 50 శాతం వరకు వరకు ఎందుకు అనుమతి ఇచ్చారన్నది మరో ప్రశ్న. ఎస్సీలు, ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగం 330 ఆర్టికల్

చెబుతున్నది. సుప్రీంకోర్టు కూడా దీనిని సమర్థిస్తున్నది. మరి తెలంగాణలో ఇప్పుడు ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పిస్తే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటుతాయి. మరి దీనికి సుప్రీంకోర్టు కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ ఏమి సమాధానం చెబుతుంది. ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వవద్దు అని చెప్పగలవా? అలా చెబితే అది రాజ్యాంగ విరుద్ధం కాదా? ఏ కారణాల వల్లనైతే కొన్ని సామాజిక వర్గాలకు ఈ దేశంలో జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించారో, అవే మౌలిక ప్రశ్నకు కూడా సమాధానం కావాలి. అసలు రిజర్వేషన్లు అవసరమే లేదు అనుకుంటే వేరు సంగతి. సామాజిక అంతరాలు తొలగించడానికి రిజర్వేషన్లు అవసరమనే ఏకాభిప్రాయమున్న దేశంలో ఒక్కో రాష్ట్రానికి ఒక నీతి, ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కో రీతి అవలంభించడం మాత్రం ఆక్షేపణీయం కాదా? రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు దక్కడం లేదనే కారణంతో బిసిలు, మహిళలకు రిజర్వేషన్లు కల్పించే వెసులుబాటు కేంద్రమే కల్పించింది. మరి అదే కేంద్రం చట్టసభల్లో బిసిలకు, మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ఎందుకు వెనుకాడుతన్నది?

సమాఖ్య లక్షణాలున్న ఏకకేంద్ర పాలనలో ఉన్న భారతదేశంలో ఇప్పటికే అనేక విషయాల్లో కేంద్రరాష్ట్రాల మధ్య అధికారాలకు సంబంధించిన వివాదాలు తలెత్తాయి అని అధికారాలు తమ వద్దే పెట్టుకుని రాష్ట్రాలను నామమాత్రం చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనా విధానం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తున్నాయని రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్ర పరిధిలోని అంశాలపై నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని రాష్ట్రాలకే అప్పగించి అటు రాజ్యాంగ స్ఫూర్తిని, ఇటు ఫెడరల్ స్ఫూర్తిని ప్రదర్శించడమొక్కటే మార్గం. రాజ్యాంగంలో చెప్పిన వారికే కాకుండా పేదరికం ఉన్న సామాజిక వర్గాలన్నింటినీ ఒకే తీరుగా పరిగణించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆచరణీయమైన, ఆదర్శప్రాయమైన మార్గం.